ప్రజాశక్తి
మంగళవారం 19 ఆగస్టు 2025
5
అనంతపురం





నారాయణరెడ్డిపల్లి గ్రామం వద్ద పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై కూర్చొన్న పెద్దారెడ్డి

పెద్దారెడ్డికి మళ్లీ నో ఎంట్రీ..!

- తాడిపత్రికి వెళ్లనీయకుండా వెనక్కు పంపిన పోలీసులు
- కోర్టు ఆదేశాలు అమలు చేయాలని పెద్దారెడ్డి పట్టు
- రోడ్డుపైనే ఆరుగంటల పాటు బైఠాయింపు
- వచ్చి చూడమన్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

తాడిపత్రి వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మరోమారు తాడిపత్రి పట్టణంలోకెళ్లేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. తగిన భద్రత నడుమ తాడిపత్రి పట్టణంలోని ఆయన నివాసానికి తీసుకెళ్లాలని ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పోలీసులు అమలు చేయించలేకపోయారు. సోమవారం ఉదయం పెద్దారెడ్డి తన నివాసం యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామం నుంచి తాడిపత్రికి వెలుతున్న సమయంలో పుట్లూరు మండలం నారాయణరెడ్డిపల్లి గ్రామం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. తాను తన ఇంటికెళితే వచ్చే సమస్య ఏమిటో చెప్పాలని పోలీసులను పెద్దారెడ్డి ప్రశ్నించారు. శాంతిభద్రతల నేపథ్యంలో తాడిపత్రికి వెళ్లేందుకు వీల్లేదని పోలీసులు చెప్పడంతో పెద్దారెడ్డి రోడ్డుపైనే దాదాపు ఆరుగంటల పాటు కూర్చీవేసుకుని బైఠాయించి నిరసన చేపట్టారు.

16 నెలలుగా తాడిపత్రికెళ్లేందుకు అడ్డంకులు

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి 16 నెలలుగా తాడిపత్రి పట్టణంలో అడుగుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. పెద్దారెడ్డి వస్తే అడ్డుకుంటామని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే శాంతిభద్రతల సమస్య వస్తుందని పోలీసులు అనుమతించలేదు. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. పోలీసులు తనను అడ్డుకోకుండా తాడిపత్రి పట్టణంలోకి అనుమతించాలని కోరారు. కోర్టు ఆయన్ను ఐదు వాహనాల్లో తాడిపత్రి పట్టణానికి వెళ్లేందుకు తగిన భద్రత కల్పించాలని ఇటీవల ఆదేశించింది. అయితే వివిధ కారణాలను చూపుతూ పోలీసులు పెద్దారెడ్డిని అనుమతించకుండా వాయిదాలు వేస్తూ వస్తున్నారు. దీంతో ఆయన పోలీసుల తీరుపై మళ్లీ కోర్టును ఆశ్రయించారు. ఈనెల 18వ తేదీన సోమవారం నాడు తగిన భద్రతతో ఆయన్ను తాడిపత్రిలోని ఇంటికి తీసుకెళ్లాలని కోర్టు ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం నాడు పెద్దారెడ్డి తాడిపత్రి పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లేందుకు ప్రయత్నించగా భద్రతా కారణాలతో పోలీసులు అనుమతించలేదు. పుట్లూరు మండలం నారాయణరెడ్డిపల్లి గ్రామం వద్దకు రాగానే నిలిపివేశారు. తాడిపత్రి పట్టణంలో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహ ప్రతిష్టను మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి సోమవారం చేపట్టారు. ఈ నేపథ్యంలో జెసి మద్దతుదారులు పెద్ద సంఖ్యలో అక్కడికి వచ్చారు. ఇదే సమయంలో పెద్దారెడ్డిల అక్కడికి వెళ్తే ఘర్షణ జరిగే అవకాశముందన్న కారణంతో పోలీసులు తాడిపత్రికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు.

జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతోనే పోలీసులు ఆపుతున్నారు : పెద్దారెడ్డి


తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పోలీసులు తనను తాడిపత్రికి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని పెద్దారెడ్డి ఆరోపించారు. తాను వెళితే శాంతిభద్రతల సమస్య వస్తుందని పోలీసులు చెబుతున్నారన్నారు. జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆయన తనయుడు అస్మిత్‌రెడ్డిలు తాడిపత్రి పట్టణంలో యథేచ్ఛగా తిరుగుతున్నా సమస్యలేదనా ప్రశ్నించారు. సమస్య ఉంటే ఇద్దరినీ బయటకు పంపించాలి కదా అన్నారు. కోర్టు ఉత్తర్వులున్నా పోలీసులు లెక్క చేయకుండా వ్యవహరించడం సరికాదన్నారు. దీనిపై మరోమారు కోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు.

పెద్దారెడ్డి బాధితులు అడ్డుకుంటున్నారు : జెసి.ప్రభాకర్‌రెడ్డి

తాను పెద్దారెడ్డి పర్యటను అడ్డుకోవడం లేదని వైసిపి ప్రభుత్వంలో ఆయన వల్ల నష్టపోయిన బాధితులే అడ్డుకుంటున్నారని జెసి.ప్రభాకర్‌రెడ్డి తెలియజేశారు. పెద్దారెడ్డి ఎమ్మెల్యేగానున్న సమయంలో తాడిపత్రిలో చాలా మందిని ఇబ్బంది పెట్టారన్నారు. అందువల్లే ఆయన్ను అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో వారు అధికారులో ఉన్న సమయంలో కోర్టు ఆదేశాలను వారెందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

ఎక్కువొచ్చినా కొరతే..!

- యూరియా కోసం రైతులకు తప్పని పాట్లు
- బ్లాక్ మార్కెట్‌కు తరలినట్టు ఆరోపణలు



జల్లాకు యూరియా ఎక్కువొచ్చిన రైతులకు మాత్రం అందుబాటులో లేవు. వచ్చిన యూరియా పక్కదోవ పడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఆర్‌ఎస్‌కెల్లోనే అందుబాటులో లేవన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల కనుసన్నల్లోనే యూరియా పక్కదోవ పడుతున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

అనంతపురం జల్లాకు ఖరీఫ్‌కు 26,839 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేస్తే 27,226 మెట్రిక్ టన్నుల జల్లాలో అందుబాటులో ఉంది. ఇందులో 22 వేల పైచీలుకు అమ్మకాలు సాగినట్టు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఈ ఏడాది వర్షాలు సరిగా లేక పంటల సాగు ఆశించినంతగా సాగలేదు. సాగునీటి వసతి ఉన్న రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోనే ఎక్కువగా వరి, మిరప తదితర పంటలు సాగవుతున్నాయి. సాగు విస్తీర్ణం తక్కువున్నా మార్కెట్‌లో రైతులకు మాత్రం యూరియా తగినంత లభించడం లేదు. ఎక్కడైనా యూరియా కావాలని రైతులొస్తే కాంప్లెక్సు కొంటేనే ఇస్తామన్న షరతులు కూడా పెడుతున్నారు. జల్లాలో ప్రయివేటు డీలర్లు, ఆర్‌ఎస్‌కెలు, హోల్‌సేలర్లు, సొసైటీల ద్వారా యూరియా అమ్మకాలు సాగుతాయి. ఇందులో అత్యధికంగా ఆర్‌ఎస్‌కె (రైతుభరోసా కేంద్రాల) ద్వారానే ఎక్కువగా ఉంటుంది. వీటికి మార్క్‌ఫెడ్ ద్వారా కేటాయింపులు జరుగుతాయి. గ్రామ స్థాయిల్లోనే ఆర్‌ఎస్‌కెలు ఎక్కువగా ఉండటంతో రైతులు తీసుకోవడానికి అనువుగా ఉంటున్నాయి.



యల్లనూరులో రైతుసేవా కేంద్రం యూరియా కోసం బారులు దీరిన రైతులు

ఆర్‌ఎస్‌కెల్లోనే ఎక్కువ కొరత ఉన్నట్టుగా కనిపిస్తుండటం గమనార్హం.

ఆర్‌ఎస్‌కెల నుంచి పక్కదారిపై సందేహాలు ?

యూరియా పంపిణీలో కీలకంగానున్న ఆర్‌ఎస్‌కెల నుంచి పక్కదారి పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల ఆర్‌ఎస్‌కెల నుంచి నేరుగా ప్రయివేటు డీలర్ల వద్దకు యూరియా చేరుతుతోందన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. కొంత మంది అధికారుల ప్రమేయం కూడా ఇందులోనున్నట్టు ఆరోపణలొస్తున్నాయి. అధికారులు మాత్రం పక్కగా పంపిణీ జరుగుతోందని చెబుతుండగా రైతులు అనేక చోట్ల యూరియా కోసం పడిగాపులుగాస్తున్నారు కేటాయింపులే తక్కువగా ఉన్నాయని బొమ్మనహాల్ తదితర మండలాల్లో వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

యూరియా కొరత లేకుండా చేయాలి : చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం జల్లా కార్యదర్శి

యూరియా కొరత తీవ్రంగా ఉంది. అనేక చోట్ల రైతులు యూరియా కోసం పడిగాపులుగాస్తున్నారు. అధికారులు కొరత లేదని ఒకవైపు చెబుతున్నా ఆచరణలో పరిస్థితులు వేరుగానున్నాయి. పంట సాగు సమయంలో రైతులను ఇబ్బంది పెట్టడం తగదు. యూరియా కొరత లేకుండా తగిన విధంగా చర్యలు తీసుకోవాలి. అదే విధంగా ప్రయివేటు డీలర్లు అయితే యూరియతోపాటు ఇతర ఎరువులు కొంటేనే ఇస్తామని షరతులు పెడుతున్నారు. ఇప్పటికైనా దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

రైతులకు యూరియా కష్టాలు

యల్లనూరు : రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. మండల వ్యాప్తంగా అనేకమంది రైతులు మొక్కజొన్న, వరి, అరటి, తదితర పంటలు సాగు చేశారు. ఆయా పంటలకు తప్పనిసరిగా యూరియా వేయాలి. దీంతో మండలంలో యూరియాకు మరింత డిమాండ్ పెరిగింది. ఇదివరకు మార్క్‌ఫెడ్ నుంచి ఎడిసిసి సహకార సంఘం ద్వారా సొసైటీకి యూరియా సరఫరా అయ్యేది. అయితే స్థానిక సహకార సంఘం సొసైటీకి యూరియా రాకపోవడంతో వ్యవసాయ శాఖ ద్వారా యల్లనూరు ఆర్‌బికెకు 12 టన్నులు యూరియా తెప్పించారు. ఈ యూరియా కనీసం వందమంది రైతులకు కూడా సరిపోవడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవ తీసుకుని రైతులందరికీ యూరియా అందేలా చూడాలని కోరుతున్నారు.

సరస్వతి విద్యామందిర్ విద్యార్థినుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని సరస్వతి విద్యాపీఠంలో నిర్వహించిన సైన్స్‌ఫేర్, మ్యాథమేటిక్స్ పోటీల్లో స్థానిక సరస్వతి విద్యామందిర్ విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం రాజేశ్వరి తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న సరస్వతి విద్యాపీఠంకు సంబంధించిన 24 పాఠశాలల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. సైన్స్ ఫేర్‌లో బెస్ట్ టైప్ ఆఫ్ ఫోర్సెస్‌లో 5వ తరగతి విద్యార్థిని హర్షిత ప్రథమ స్థానంలో, గీత ద్వితీయ స్థానంలో నిలిచారు. మోడల్ బేసిక్ ఆపరేటర్లలో 5వ తరగతి విద్యార్థిని వైష్ణవి ప్రథమ స్థానం సాధించింది. వీరికి హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ రమేష్, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వీరు ఈ నెల 20వ తేదీ రాయలసీమ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను అందుకు కృషి చేసిన హెచ్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయ బృందం చంద్రకళ, అనసూయ, శృతి, భవానీ, మహాదేవి, పాఠశాల అధ్యక్షుడు ధనార్జున అభినందించారు.



ఢీకొన్న టెంపోట్రావెలర్.. ఆర్టీసీ బస్సు

విషాదయాత్ర..!

- టెంపోట్రావెలర్, ఆర్టీసీ బస్సు ఢీ
- నలుగురు మృతి.. 9 మందికి గాయాలు

తిరుమల దైవ దర్శనం పూర్తి చేసుకుని ఇంటికి వస్తున్న కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం వెంటాడింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన అవ్వా మనువరాలు, టెంపో డ్రైవర్, మరో వ్యక్తి మరణించారు. తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ప్రమాదం బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నిపింది.

వార్త మెయిన్‌లో

దుర్గం అభివృద్ధికి సహకరించండి : విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాబోయే 20 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని రాయదుర్గం పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు పుర ప్రముఖులు సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. స్థానిక సీతారామాంజనేయ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్ గురించి కాలవ వివరించారు. పట్టణాన్ని భావితరాలు ఏ విధంగా చూడాలని భావిస్తున్నాయో అందుకు అనుగుణంగా రూపకల్పన జరగాలన్నారు. 2014-19 మధ్య జరిగిన ప్రధాన రహదారుల విస్తరణ పనులను పట్టణవాసులు మెచ్చుకున్న విషయాన్ని గుర్తు చేశారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏ ప్రాంతంలో ఎలాంటి పనులు చేపట్టాలన్న అంశాలపై నమూనా ప్రతిపాదన సిద్ధం చేయించామన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ ప్రయివేట్ సంస్థ పట్టణాభివృద్ధికి సంబంధించి ఓ సమగ్ర ప్రాథమిక నివేదిక తయారు చేసిందన్నారు. ఇందులో పేర్కొన్న అంశాల్లో మన పట్టణ అవసరాలకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. పట్టణ వాసులు ఇందులోని అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఛైర్‌పర్సన్ శిల్ప, తహశీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి డీఈఈ రవిశంకర్ రెడ్డి, కౌన్సిలర్లు ప్రశాంతి, పద్మజ, సంజీవ, గోవిందరాజులు, మాజీ వైస్ ఛైర్మన్ కడ్డిపూడి మహబూబ్ బాషా, హనుమంతు, గ్యాస్ కృష్ణ, షబ్బీర్, సోమ పాండు, టిపిఎస్ మురళీమోహన్, పట్టణ ప్రముఖులు, వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

అదనపు యూరియా సరఫరా చేయండి

రాయదుర్గం రూరల్ : నియోజకవర్గంలో యూరియా కొరత అధికంగా ఉందని, అదనంగా సరఫరా చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు విన్నవించారు. కాలవ సోమవారం పట్టణంలోని తన నివాసంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో యూరియా సరఫరా, డిమాండ్‌పై ఆరా తీశారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రికి ఫోన్ చేసి పలు విషయాలు వివరించి యూరియా అధికంగా సరఫరా చేయాలని కోరారు. అనంతపురం జిల్లాలో వరి ఎక్కువగా సాగు చేసే ప్రాంతం రాయదుర్గం నియోజకవర్గమేనని, ప్రస్తుతం తుంగభద్ర ఎగువ కాలువ కింద వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో యూరియాకు అధిక కొరత ఏర్పడిందన్నారు. ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని యూరియా అదనంగా సరఫరా చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎడిఎ పద్మజ, ఏవో అహ్మద్‌బాషా పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఈవోఆర్డీ దాస్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అనంతపురంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల్ కేశవ్, ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ నుంచి ఉత్తమ అవార్డు అందుకున్నారు. దీంతో ఆయనను సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ విజయభాస్కర్, తహశీల్దార్ మునివేలు, తదితరులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా దొణ గంగమ్మ జాతర

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండలంలోని టి.వీరాపురం గ్రామంలో శ్రావణమాసం ఆఖరి సోమవారం జరిగే దొణ గంగమ్మ జాతర అశేష భక్త జన సందోహం మధ్య ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పట్టణ, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన దోణ గంగమ్మ రథోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు సుంకన్న, సోమశేఖర్, గంగాధర్‌శెట్టి ఉన్నారు.

త్వరలో 88 మెట్రిక్ టన్నుల యూరియా : ఎడిఎ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎడిఎ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలానికి త్వరలోనే 88 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని రాయదుర్గం ఎడిఎ పద్మజ తెలిపారు. ఆమె సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో యూరియా కొరతపై తహశీల్దార్ మునివేలు, మండల వ్యవసాయ అధికారి సాయికుమార్, తదితరులతో సమీక్ష, సమావేశం నిర్వహిం చారు. ఎడిఎ మాట్లాడుతూ మండలానికి త్వరలో 88 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని భరోసా ఇచ్చారు. మండలంలో అక్కడక్కడ సచివాలయాల్లో ఒక్కో రైతుకు ఆధార్ కార్డుకు 4 బస్తాల చొప్పున యూరియా ఇచ్చామని, మిగిలి రైతులకు అవసరమైనంత యూరియా సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో సచివాలయ, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు

మహిళా మార్ట్ పనితీరు బాగుంది..!

గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టికె.అనిల్ కుమార్



నార్పలలో మహిళా మార్టులో సరుకులను చూస్తున్న టికె.అనిల్‌కుమార్

ప్రజాశక్తి-నార్పల

నార్పలలో నిర్వహిస్తున్న మహిళా మార్టు నిర్వహణ, పనితీరు బాగుందని భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టికె.అనిల్ కుమార్ తెలిపారు. జిల్లా పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, పీడీ శైలజ, అడిషనల్ సీఈవో శ్రీరాములు నాయుడు, సర్ఫ్ డైరెక్టర్ శివ శంకర ప్రసాద్‌తో కలిసి నార్పల మండల కేంద్రం వెలుగు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా మార్ట్‌ను పరిశీలించారు. మార్టులో క్రయవిక్రయాలు ఎలా జరుగుతున్నాయి.. మార్ట్ టర్నోవర్ ఎంత.. నిర్వహణ ఎలా జరుగుతుంది..? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. రూ.11.80లక్షల లాభంలో నార్పల మహిళా మార్ట్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని అధికారులు తెలిపారు. అనంతరం సుల్తాన్‌పేటలో స్నేహ కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ కేంద్రంలో తయారయ్యే వస్తువులను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. కొత్త బస్టాండ్ సమీపంలో శ్వేత గానుగ కేంద్రాన్ని పరిశీలించారు. బొందలవాడలో రాధిక బెల్లం తయారీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ తయారైన బెల్లాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో మమతా దేవి, డిప్యూటీ ఎంపీడీవో శైలజ రాణి, డిపిఎంలు గంగాధర, సత్యనారాయణ, శ్రీనివాసులు, వెంకట్రావు ఏసీ సుభద్రమ్మ, ఎపిఎంలు మంజుల, తిప్పక్క, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్యామల, సీసీలు రామకృష్ణ నాగరత్న, రామచంద్ర ఉన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన అర్జీదారుల నుంచి 550 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల జిల్లా అధికారులు నాణ్యతగా అర్జీలను పరిష్కరించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మలోలతో పాటు వివిధ శాఖల జిల్లా అదికారులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఇతర అవసరాలకు యూరియాను వినియోగిస్తే గుర్తించండి

యూరియాను వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు ఉపయోగిస్తుంటే దానిని గుర్తించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అదికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు కలిసికట్టుగా తనిఖీలు నిర్వహించి 48 గంటలల్లోపు దీనిపై నివేదిక అందించాలన్నారు. జిల్లాకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెల వరకు 26,839 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, మొత్తం 29,527 మెట్రిక్ టన్నుల యూరియా లభ్యత ఉండగా, 26,008 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయం జరిగిందన్నారు. 3,519 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. సరిహద్దు రాష్ట్రాలకు సబ్సిడీ యూరియా, ఎరువులను అనధికారికంగా తరలిస్తుంటే నిఘా ఉంచి అడ్డుకోవాలన్నారు.

శ్రావణి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఇటీవల అత్తింటి వారి వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడిన శ్రావణి తల్లిదండ్రులను సోమవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తనయుడు యశ్వంత్‌చౌదరి పరామర్శించారు. యశ్వంత్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ వైపి.రమేష్, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మల్లికార్జున, ఇతర నాయకులతో కలిసి పట్టణం లోని శ్రావణి తల్లిదండ్రులైన రామాంజనమ్మ, నాగరాజుల ఇంటికి వెళ్లారు. వారిని పరామ ర్శించి, మీకు ఎల్లవేళలా టిడిపి అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. కాసేపు శ్రావణి కుమార్తె పర్ణితతో ఆడుకున్నారు. చిన్నారి చదువు, ఇతర అవసరాల కోసం రూ. 2 లక్షలు పోస్టాఫీస్(సుకన్య సమృద్ధి యోజన పథకం)లో జమ చేసేందుకు పర్ణిత అవ్వతాతలకు అందజేశారు. మహిళలకు అన్యాయం జరిగితే తాము సహించబోమని, ఆత్మహత్యకు కారణమైన వారికి శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు.

వైసిపి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఇటీవల పట్టణంలో ఆత్మహత్యకు పాల్పడిన శ్రావణి ఆత్మకు శాంతి కలగాలని కాంక్షిస్తూ సోమవారం వైసిపి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. వైసిపి మున్సిపాలిటీ కన్వీనర్ ఐ.సుధీర్ ఆధ్వర్యంలో సాయంత్రం నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులు చేతబూని ర్యాలీగా టి సర్కిల్ చేరుకున్నారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. హత్యలు, మానభంగాలు, చిత్రహింసలు, పోక్సో, కేసులు లైంగిక వేధింపులు, తదితర నేరాలు అధికమయ్యాయన్నారు. నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. శ్రావణి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించేంత వరకూ వైసిపి అవిశ్రాంత పోరాటం చేస్తుందన్నారు. ర్యాలీలో ఎంపిపి మారతమ్మ, నాయకులు గోళ్ల సూరి, షేక్షావలి, బిక్కి హరి, బిక్కి నాగలక్ష్మి, చందన, శివాజీ, మమత, లత, లక్ష్మీకాంతమ్మ, అర్చన, శ్రీనివాసులు, వెంకటేశులు, చరణ్, భీమలింగ, ఓంప్రకాష్, అజయ్, వడ్డే నరేష్, అంజి, మల్లి, మోహన్ పాల్గొన్నారు.

తూతూమంత్రంగా ఫిర్యాదుల దినోత్సవం

ఒకరిద్దరే హాజరవుతున్న అధికారులు-ఎక్కడి సమస్యలు అక్కడే..

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ఫిర్యాదుల దినోత్సవం) కార్యక్రమం తూతూమంత్రంగా సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యక్రమానికి మండల స్థాయిలోని అన్నిశాఖ అధికారులు హాజరు కావాలి. అయితే ఒకరిద్దరు మినహా అధికారులు ఎవరూ హాజరు కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వచ్చిన అధికారులు చూడా సెల్ కాన్ఫరెన్స్ సమాచారానికే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు ఉంటున్నాయి. దీంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని ప్రజలు వాపోతున్నారు. ఈనేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ తీసుకొచ్చిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఆశయం నీరుగారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు అందరూ హాజరయ్యేలా చూసి ప్రజా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఆత్మకూరు తహశీల్దార్ కార్యాలయం

రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద బ్రిడ్జి నిర్మించాల్సిందే..

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని తపోవనం వెళ్లే దారిలో ఉన్న రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద బ్రిడ్జి నిర్మించి ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం నాయకులు రాజు అధ్యక్షతన రిషిత స్కూల్ వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ.నల్లప్ప మాట్లాడుతూ నగర అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు పెడుతున్నామని ప్రకటనలు చేస్తున్న పాలకులు రిషిత స్కూల్ వద్ద బ్రిడ్జి ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. దీనికితోడు తిక్క రంగయ్య స్వామి గుడి నుంచి తపోవనం వెళ్లే దారి పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే నడుం, మెడనొప్పులు వస్తాయన్నారు. అలాగే నడిమివంక సైడ్ వాల్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఆయా కాలనీల ప్రజలు వర్షాకాలం భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. చిన్నపాటి వర్షం వచ్చిన రాత్రింబవళ్లు జాగారం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఆయా సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా నాయకులు స్పందించి ఆయా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సిపిఎంతోపాటు మిగిలిన పార్టీలను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీక్షలకు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, వైసిపి, టిడిపి, తదితర పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు నాగరాజు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ జయచంద్ర నాయుడు, వైసిపి నాయకులు రామచంద్ర, రంగంపేట గోపాల్‌రెడ్డి, నిమ్మల నాగరాజు, టిడిపి నాయకులు శంకర, తపోవనం రాజు, కాంట్రాక్టర్ రామ్మోహన్, సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి నగర కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ప్రకాష్, ఇర్ఫాన్, మసూద్, వలీ, రాజు, జీవ, గఫూర్, లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసమ్మ, ఆదినారాయణ, మహేష్, గ్యాస్ రమణ, ఆటో రామాంజనేయులు, నాగేంద్ర, వరలక్ష్మి, సునీత, బాషా, వెంకటేష్, ముసలప్ప, రాముడు, వీరన్న, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

జెవివి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జన విజ్ఞాన వేదిక జిల్లా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్ సోమవారం సంగమేశ్‌నగర్‌లోని కార్యాలయంలో ప్రకటించారు. 41 మంది సభ్యులతో నూతన కమిటీ ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులుగా కళ్యాణదుర్గానికి చెందిన కన్నేపల్లి చిత్తప్ప, ప్రధాన కార్యదర్శిగా అనంతపురానికి చెందిన కెంచాల వీరరాజు, కోశాధికారిగా మహమ్మద్ జిలానీ, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ రంగన్న, డాక్టర్ వి.ప్రసూన, సాకే భాస్కర్, గౌరవ సలహాదారులుగా మల్లికార్జున, వికె విద్యావతి, ఉపాధ్యక్షులుగా రామిరెడ్డి, శివానంద, శశికళ, ప్రసాదరెడ్డి, రాజన్న, నాగరత్న, కార్యదర్శులుగా తిరుపాలు, తిప్పేస్వామి, రాఘవేంద్ర, సింహాద్రి, రంగనాథ్, రామచంద్రయ్య, సబ్ కమిటీల కన్వీనర్లగా విద్యా కమిటీకి గాంగేనాయక్, వైద్య కమిటీకి లక్ష్మీనారాయణ, సమతా కమిటీకి రాధ, మ్యాజిక్ కమిటీకి ప్రసాద్, ఆడిట్ కమిటీకి శ్రీనివాసరావు, కల్చరల్ సబ్ కమిటీకు వెంకటరామిరెడ్డి ఎన్నికైనట్లు తెలిపారు.


జెవివి జిల్లా అధ్యక్షులు చిత్తప్ప


జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి వీరరాజు

వైద్యుల నిర్లక్ష్యంతోనే మారెప్ప మృతి

ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-గుత్తి

వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మారెప్ప మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు మృతదేహంతో సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మృతుడి కుమారుడు ఓబులరాజు తెలిపిన వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలంలోని గుత్తి వెంకటాంపల్లి గ్రామానికి చెందిన మారెప్ప తీవ్రజ్వరంతో బాధ పడుతూ సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అయితే ఉదయం నుంచి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ఎలాంటి చికిత్స అందించలేదని కుమారుడు ఆరోపించారు. గుత్తి ఆసుపత్రిలో వైద్యులు పట్టించుకోకపోవడంతోనే మారెప్ప మృతి చెందాడని వాపోయారు. అనంతరం మృతదేహంతో ఆసుపత్రి తలుపులు, ప్రధాన గేట్ మూసివేసి మతదేహంతో నిరసన తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించమని ఆసుపత్రి సిబ్బంది, పోలీసులతో వాగ్వాదానికి దిగారు.


మృతదేహంతో ఆందోళన చేస్తున్న మారెప్ప కుటుంబ సభ్యులు

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

గుత్తి : ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో విదుత్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎపి ఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.పద్మనాభపిళ్లై సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. నివాస పరిసరాల వద్ద ఇనుప వస్తువులను పడేయరాదన్నారు. విద్యుత్ తీగలు తెగిపడి ఉంటే తాకరాదన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగల సమీపంలో గుడారాలు, షెడ్లు, టెంట్లు వేసుకోరాదన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912 ను సంప్రదించాలని కోరారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

డీజిల్ లేకేజీ అడ్డుకట్టకు చర్యలు

యల్లనూరు : మండల కేంద్రంలోని ఎడిసిసి సహకార సంఘం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హిందూస్థాన్ పెట్రోల్ బంకులో డీజిల్ ట్యాంక్ లికేజీ మరమ్మతులకు చర్యటు చేపట్టారు. 'పెట్రోల్ బంకులో డీజిల్ ట్యాంకు లీకేజీ' పేరుతో ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన హిందూస్థాన్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ సేల్స్ మేనేజర్ సోమవారం పెట్రోల్ బంకులోని డీజిల్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఏప్రిల్ నుంచి సుమారు 19వేల లీటర్ల డీజిల్ వృథా అయినట్లు గుర్తించారు. రెండు, మూడు రోజుల్లో లీకేజీకి మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్

నత్త నడకన నక్ష ప్రోగ్రాం

నేడు కమిషనర్లతో డిఎంఎ రీజియన్ సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగిపోతున్నాయి. కార్పొరేషన్ ఖజానాకు రావాల్సిన రాబడికి భారీ ఎత్తున గండికొడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే సమయంలో బిపిఎస్ దరఖాస్తుల క్లియరెన్స్ నత్త నడకన సాగుతోందన్న చర్చ నడుస్తోంది. నగరంలో ఇటీవల జోరుగా భారీ భవంతులు, వాణిజ్య సముదాయాల నిర్మాణాలు అనుమతులు లేకుండా జరుగుతున్నాయి. బిల్డింగ్ ప్లాన్ అనుమతులకు విరుద్ధంగా పక్కవారి స్థలాలను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన సంఘటనలు వెలుగు చూశాయి. కోర్టు రోడ్డులో సాక్షాత్తు స్థల యజమానులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నిర్మాణం విషయంలో సాక్షాత్తు హైకోర్టు ఉత్తర్వులు సైతం భేఖాతరు చేస్తూ టౌన్‌ప్లానింగ్ అధికారులు వ్యవహరించటం చూస్తే వారి పనివిధానం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కార్పొరేషన్‌లో విభాగ అధికారులు మరో ఉద్యోగితో కలిసి బిల్డర్‌గా అవతారాలు ఎత్తి నిర్మాణాలు సాగిస్తున్నారని విజిలెన్స్ విభాగానికి సైతం ఫిర్యాదులు అందాయి. ఇటీవల కాలంలో ప్రయివేటు వ్యక్తులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి నిర్మాణాల వద్దకు వెళ్లి టౌన్ ప్లానింగ్ అధికారుల పేరు చెప్పి మామూళ్ల దందాకు తెరతీశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 14 మంది సిబ్బంది ఉండాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగంలో కేవలం ఒకే ఒక్కరు విధులు నిర్వహిస్తున్నారు. పని ఒత్తిడి పేరుతో ప్రయివేటు వ్యక్తులకు అనుకూలంగా పనులు చక్కపెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. పన్ను వసూళ్లకు పక్కా రికార్డు తయారు చేసే నక్ష ప్రోగ్రామ్స్ సైతం నతనడకన సాగుతోంది. దీనిపై అర్బన్ ఎమ్మెల్యే రెండు రోజుల క్రితం జరిగిన సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. కార్పొరేషన్‌లో రూ.14 కోట్ల పన్నుల బకాయిలు ఉన్నాయని వీటిని వసూళ్లు చేయాలంటే నక్ష ప్రోగ్రాం త్వరితగతిన పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను ఎమ్మెల్యే తెలిపారు. కొండలా పేరుకు పోయిన రూ.14కోట్ల పన్ను బకాయిల వసూళ్ల అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో ప్రభుత్వం ప్రకటించే రాయతీల సమయంలో మాత్రమే కొంత మేరకు పన్ను వసూళ్ల ఊపందుకుంటున్నాయిజ తర్వాత చతికిల పడుతున్నాయన్న చర్చ ఉద్యోగ వర్గాల్లో సాగుతోంది. రూ.23 కోట్ల రూపాయల టెండర్ దక్కించుకున్న ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ హైదరాబాద్ అర్ధాంతరంగా పనులు నిలిపివేసిందిజ దీనిపై పాలకవర్గం, అధికార పక్ష నేత పరస్పరం విమర్శలు సవాళ్లు విసురుకున్నారు. దీనిపై విజిలెన్స్ దర్యాప్తు జరపాలని అర్బన్ ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. అదే సమయంలో ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ రూ.12 కోట్ల వ్యయంతో తమిళనాడులోని ఈ రోడ్డుకు చెందిన జిగ్మా కంపెనీకి కంపోస్టు యార్డులో బయోమైనింగ్ పనులు అప్పగించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో సమర్థులైన ఇంజినీరింగ్ అధికారులు ఉన్నప్పటికీ కంపోస్ట్ యార్డులో బయోమైనింగ్ పనులను పబ్లిక్ హెల్త్‌కు అప్పగించడంలో తెర వెనుక పెద్ద మంత్రంగమే జరిగిందన్న చర్చ అధికార వర్గాల్లో నడుస్తోంది. దీనికి తోడు ఏడాదిన్నర కాలంగా మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడం నెలల తరబడి బిల్లులు ప్రాసెసింగ్ జరగకుండా ఆన్లైన్లోనే పెండింగ్‌లో ఉన్నాయన్న చర్చ నడుస్తోంది.

నేడు కమిషనర్ల డిఎంఎ సమావేశం

మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ సురేష్ కుమార్ మంగళవారం అనంత మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాలులో రీజియన్ కమిషనర్ల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం కమిషనర్ బాలస్వామి కౌన్సిల్ హాల్‌లో వివిధ విభాగాల సిబ్బందితో సమీక్ష జరిపి ప్రగతి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో నేడు జరుగుతున్న సమావేశంలో ప్రగతి, అవినీతి అక్రమాలపై దృష్టి సారించి డిఎంఎ ప్రక్షాళన దిశగా చర్యలు చేపడతారా అని ఉద్యోగ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

అనంతపురం కార్పొరేషన్ : మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కార్పొరేషన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో వారి బిడ్డలకు ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీం వర్తింపజేయాలని, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కుటుంబంలో ఉపాధి కల్పించాలని, పెరిగిన నగరానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న సరెండర్ లీవు ఇవ్వాలన్నారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ. చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పిస్తామన్నారు. అడిషనల్ వర్కర్లకు ఈనెల నుంచి రూ.14,560 వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిఐటియు నగర కార్యదర్శి తిరుమలేశు, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, ఆఫీస్ బేరర్స్ నారాయణ, కోనప్ప, బంగ్లా రాఘవ, నల్లప్ప, పెన్నా జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చేస్తే సహించం

గుంతకల్లు : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మురికి కాలువల్లో పూడిక తీయకపోవడంతో వర్షం నీరు ఇళ్లల్లోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా కుక్కలు, దోమల బెడద నుంచి ప్రజలను కాపాడాలని, వర్షం కారణంగా దెబ్బతిన్న రోడ్లను సరిచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, సురేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యులు ఉలిగప్ప, షాష, తిమ్మప్ప, వెంకీ, ఈరన్న, రవి, పరశురాం, మహిళా సంఘం నాయకురాలు సుగుణ, షకీరా, సరస్వతి, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

గుత్తి : సుభాష్ చంద్రబోస్ వర్థంతిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు, కార్యదర్శి రామ్మోహన్ ఆధ్వర్యంలో చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు ఫక్రుద్దీన్, షేక్షావలి, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, హస్సన్ అహమ్మద్, నారాయణ శెట్టి, శామ్యూల్, దేవదాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారుతున్నా.. మారని బీడీ కార్మికుల బతుకులు

బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ జి.ఓబులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ప్రభుత్వాలు మారుతున్నా.. బీడీ కార్మికుల జీవితాలు మారడం లేదని ఎపి బీడీ, సిగార్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఓబులు అన్నారు. సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఎన్‌జిఒ హోంలో ఎపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో మొదటి మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రితోపాటు పరిసర ప్రాంతాల్లో దాదాపు 7వేల మందిపైగా బీడీ కార్మికులు ఉన్నారన్నారు. వీరు బీడీ పనులు తప్ప ఏ పనీ చేయలేరన్నారు. అలాంటి వారి శ్రమను ఆయా పరిశ్రమలు దోచుకుంటూ హక్కులను కాలరాస్తున్నాయన్నారు. 1966, 1976 కార్మిక, సంక్షేమ చట్టాలను రద్దు చేసిబీడీ కార్మికులను ఆదుకుంటామని పార్లమెంటులో చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇంతవరకూ వాటిపై కనీస వివరాలు సేకరించకుండా నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. తాడిపత్రిలో బీడీ కార్మికులకు ఇళ్లస్థలాలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. తాడిపత్రి కార్యదర్శిగా రహీంబి కోశాధికారిగా ఆరిఫా, ఉపాధ్యక్షులుగా షాను, సహాయ కార్యదర్శులుగా మాబున్నీ, బేబీ, బసిరున్, షాహిదా, శాను, గౌరవాధ్యక్షులుగా ఉమాగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతురెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


కార్మికులతో బీడీ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు జి.ఓబులు


వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని వినతి

గుత్తి : మండలంలో నెలకొన్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ జి.పుణ్యవతికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ మండలంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు. ఉపాధి లేక నిరుద్యోగులు ఇతర పట్టణాలకు వలస వెళుతున్నారన్నారు. కావున గుత్తిలో ఉన్న శిక్షణ కేంద్రాలను తెరిపించాలన్నారు. శిక్షణ కేంద్రాల్లో నిరుద్యోగులకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, రంగా, రమేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించాలని ధర్నా

గుత్తి : డిగ్రీ ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా డిగ్రీ విద్యార్థులకు ఇంకా అడ్మిషన్లు ప్రారంభం కాలేదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రెండు వారాల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెడికల్ క్యాంపుకు నిర్వహించి అనారోగ్యం పాలు కాకుండా చూడాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో భాగంగా 77 వ జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్న జీవోపై విద్యాశాఖ మంత్రి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. అనంతరం తహశీల్దార్ జి.పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్ యాదవ్, నాయకులు చరణ్, థామస్, జగన్, ఓంసాయి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నాటక ఆనకట్టలతో బిటిపికి రాని నీరు

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుమ్మగట్ట

కర్ణాటక రాష్ట్రం నిబంధనలకు విరుద్ధంగా పై ప్రాంతంలో ఆనకట్టలు నిర్మించడంతోనే భైరవానితిప్ప ప్రాంజెక్టుకు నీరు రావడం లేదని విప్ కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. సోమవారం మండల పరిధిలోని బిటిపిని కాలవ సందర్శించి పరిశీలించారు. ఎగువ కురుస్తున్న వర్షాలకు బిటిపిలో 52 అడుగులకు నీటిమట్టం చేరుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు బిటిపికి నీరు వచ్చినట్లు తెలిపారు. అయితే కర్నాటక రాష్ట్రం నిబంధనలను విస్మరించి ఆనకట్టలు కట్టడంతో దిగువకు నీరు రాకుండా పోతోందన్నారు. ప్రస్తుతం అధిక వర్షాలు కురిసినందున కర్ణాటక రాష్ట్రం నుంచి దిగువకు నీరు వచ్చినట్లు తెలిపారు. బిటిపి పూర్తి సామర్థ్యం 55 అడుగులుకాగా, 52 అడుగులకు నీరు చేరిదన్నారు. రైతులు కూడా సంతోషంగా ఉన్నారన్నారు. నీటిని రైతులు వృథా చేయకుండా దామాషా పద్ధతిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటి పట్టాలు పంపిణీ

మండల పరిధిలోని బిటిపి గ్రామంలో సుమారు 52 మందికి మంజూరైన ఇంటి పట్టాలను విప్ కాలవ శ్రీనివాసులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళికేర పంచాయతీ పరిధిలో ఉన్న కెపి.కుంట, తాళికేర, బిటిపి గ్రామాలకు చెందిన అర్హులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేశామన్నారు. అంతేగాకుండా త్వరలో ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కల నెరవేస్తామని తెలిపారు. ఇంకా అర్హులకు ఎవరికైనా ఇంటి పట్టాలు రాకుంటే అధికారులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం రూ.23.9లక్షలతో నిర్మించిన రైతు సేవాకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్ రజాక్‌వలి, ఎంపిడిఒ రామకృష్ణ, టిడిపి మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సనన్న, నాయకులు సదాశివ, మంజునాథ, వీరాపురం సర్పంచు నాగరాజు, బేలోడు సంజీవ, చిన్ని కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.


భైరవానితిప్ప ప్రాజెక్టును పరిశీలిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దు

సీనియర్ సివిల్ జడ్జి వి.రాజశేఖర్

ప్రజాశక్తి అనంతపురం

విద్యార్థులు ర్యాగింగ్ జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి వి.రాజశేఖర్ సూచించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా ఆధ్వర్యంలో 2022-23వ బ్యాచ్ మెడికోలకు సోమవారం ర్యాగింగ్ నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ ర్యాగింగ్ ఓ పెనుభూతం అన్నారు. కావున ర్యాగింగ్ జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. బంగారం లాంటి డాక్టర్ వృత్తికి న్యాయం చేసేలా జూనియర్లతో స్నేహభావంగా మెలగాలన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ షారోన్ సోనియా మాట్లాడుతూ తమ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడకుండా యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసి నిత్యం అటే హాస్టల్, ఇటు కళాశాల, ఆసుపత్రిలో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ర్యాగింగ్‌కి పాల్పడితే శిక్షలు తప్పవని హెచ్చరించారు. అనంతరం యాంటీ రేగింగ్ అవేర్నెస్ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వైద్య విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శంకర్, డాక్టర్ మధుసూదన్, సీనియర్ డాక్టర్లు వాల్మీకి శ్రీనివాస్, సరళ, దుర్గ, రమేష్‌బాబు, పద్మశ్రావణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.




యాంటీ ర్యాగింగ్‌పై ప్రతిజ్ఞ చేయిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వి.రాజశేఖర్

బాడుగ చెల్లించాం..

రికార్డుల్లో లేవంటున్న అధికారులు-ఆందోళనలో దుకాణదారులు

పజాశక్తి-నార్పల

బాడుగ చెల్లించాం.. అయినా నోటీసులు ఇచ్చారు.. అంటూ మండల కేంద్రంలోని పంచాయతీ పరిధిలోని సెలూన్ దుకాణదారులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో ఉన్న పంచాయతీ రూముల బాడిగలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండటంతో గత కొద్ది రోజుల క్రితం డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్యామల కలిసి పోలీస్ బందోబస్తు నడుమ బాడుగలు చెల్లించని కొన్ని దుకాణాలకు తాళాలు వేయించారు. అధికారులు దాదాపు 26 నెలల నుంచి పంచాయతీ దుకాణాలకు బాడుగలు చెల్లించలేదని ఇద్దరు సెలూన్ దుకాణదారులకు నోటీసులు ఇచ్చారు. అయితే సెలూన్ నిర్వాహకులు మాత్రం 2024 మార్చి వరకూ తాము బాడిగులు చెల్లించామని, అందుకు సంబంధించిన రసీదులు చూపుతున్నారు. కేవలం తాము 16 నెలల బాడుగ మాత్రమే పెండింగ్‌లో ఉందని దుకాణదారులు చెబుతున్నారు. అధికారులు మాత్రం 26 నెలల బాడుగ పెండింగ్‌లో ఉందని.. మీ వద్ద ఏ రసీదులుఉన్నా.. అందుకు సంబంధించి తమ వద్ద రికార్డులు లేవని అంటున్నారు. అధికారులకు తెలియకుండానే దుకాణదారులకు పంచాయతీ బిల్లు రసీదులు వచ్చాయా.. లేదా దుకాణదారులకు అధికారులు రిసిప్టులు ఇచ్చి రికార్డుల్లో నమోదు చేయలేదా.. అని పలువురు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా దీనిపై సమగ్ర విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని దుకాణదారులు కోరుతున్నారు.



బాడుగ చెల్లించినట్లు దుకాణదారుడి వద్ద ఉన్న రసీదు

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఉరవకొండ : వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కార్యదర్శి కమిటీ సభ్యులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఉరవకొండలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 రోజులుగా కురిసిన వర్షాలకు రైతులు సాగు చేసిన పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ముఖ్యంగా బోరు బావుల కింద ఎక్కువ మంది రైతులు వేరుశనగ పంటను సాగు చేసి నష్టపోయారన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకుని మండల వ్యాప్తంగా దెబ్బతిన్న పంటను పరిశీలించి ఆదుకోవాలని కోరారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

శింగనమల : రాష్ట్రంలోని మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టిడిపి తెలుగు యువత మాజీ కార్యదర్శి మాసూలు చంద్రమోహన్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ముఖ్యంగా ఇటీవల కూటమి ప్రభుత్వం అమలు చేసిన స్త్రీశక్తి పథకం ద్వారా మరోసారి నిరూపితమైందన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించినందుకు సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

22న బహిరంగ వేలం

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో తలనీలాలు, పాత్ర సామానులు ఇచ్చుకునేందు, కలగలపు బియ్యం, బేడలు అమ్మేందుకు ఈనెల 22వతేదీన బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సాకే రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరం

గుమ్మఘట్ట : మండల పరిధిలోని 75 వీరాపురం గ్రామంలో మంగళవారం నుంచి ఈనెల 23వతేదీ వరకూ ప్రత్యేకంగా ఆధార్ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ రామకృష్ణ తెలిపారుజ ఈ శిబిరంలో బడి పిల్లలకు ఆధార్, బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు గుత్తి విద్యార్థి

గుత్తి : గుత్తిలోని ఆర్‌కె యోగా కేంద్రం విద్యార్థి వరుణ్‌తేజ్ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. సోమవారం గుంతకల్లులో జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగాసనా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్-2025 నిర్వహించారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో శ్రీ వరుణ్ తేజ్ మొదటి స్థానం (బంగారు పతకం) సాధించాడు. త్వరలో ద్వారకా తిరుమలలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. అత్యుత్తమ ప్రతిభ చూపిన వరుణ్‌తేజ్‌ను యోగా గురువు రామకృష్ణారావు, తల్లిదండ్రులు, తోటి మిత్రులు అభినందించారు.

నేత్రదానం మహాదానం

అనంతపురం : అనారోగ్యంతో మృతిచెందిన నగరంలోని హౌసింగ్ బోర్డుకు చెందిన చంద్రభానురెడ్డి కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకొచ్చారు. ఈమేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి డాక్టర్ డివై కుళ్ళాయప్ప, ఐ కలెక్ట్ సెంటర్‌బి టెక్నీషియన్ జి రాఘవేంద్ర, సక్షమ్ జిల్లా సహకార్యదర్శి విజయ భాస్కర్‌రెడ్డి మృతుడి ఇంటికి చేరుకుని నేత్రాలను సేకరించారు.

ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో వ్యక్తి మృతి


మృతిచెందిన బాబావలి

బుక్కరాయసముద్రం : ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది బుక్కరాయసముద్రం పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. బాబావలి (65) అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లో కడపకు వెళ్లే ఆర్టీసీ బస్సులో ఎక్కాడు. అయితే మార్గమధ్యలో బుక్కరాయసముద్రం రాగానే అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మృత్యువాత పడ్డాడు. గమనించిన తోటి ప్రయాణికులు బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్ వద్ద బస్సును నిలిపి పోలీసులకు సమాచారం అందించారు. తర్వాత పోలీసులు కుటుంబీకులకు ఫోన్ చేసి విషయం తెలిపారు.

జిఒ 30/67ను రద్దు చేయాలి

వైఎస్ఆర్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరసనలు


నిరసన తెలుపుతున్న వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విడుదల చేసిన 30/67 జీవోను వెంటనే రద్దు చేయాలని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం నగరంలో జడ్పీ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలు కావడం లేదన్నారు. కేవలం రెడ్‌బుక్ పాలన, ఎల్లో బుక్ ఎడ్యుకేషన్ పాలసీ నడుస్తోందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలు బయటకి వస్తాయన్న భయంతోనే ప్రభుత్వ పాఠశాల్లోకి ఎవ్వరూ వెళ్లకూడదనే జీవోని తీసుకొచ్చిందన్నారు. వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, శింగనమల నియోజకవర్గ అధ్యక్షులు రేవంత్, నగర నాయకులు రాహుల్‌రెడ్డి, ఆదిల్, అశోక్, నరేంద్రారెడ్డి, సిద్ధిక్, రోహిత్, జిలాన్, సతీష్, నాగేంద్ర, గణ, రోహిత్, గణేష్‌రెడ్డి, హాజీబ్, రఫీక్, నిఖిల్, చిన్న, షేక్షా, దాదు, సుభహాన్, ఆఫ్రిద్, ఇమ్రాన్, షాహిద్, శివ, సాయి, రవి, పూజ విగ్నేష్, బాబా ఇమ్రాన్, సురేంద్ర, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : జీవో 30/67ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గుంతకల్లు అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లరిబ్బన్లు కట్టుకుని వైసిపి విద్యార్థి విభాగం నాయకులు నిరసన తెలిపారు. ఈ నిరసలో వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కసాపురం వంశీ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షులు నరప్ప, పట్టణ, మండల అధ్యక్షులు మణికంఠ, నాయకులు అనిల్‌కుమార్, పవన్‌కుమార్, విష్ణుసాయి యాదవ్, జయరెడ్డి, శివ, అభి, అశోక్, మధు, అజయ్, గణేష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ రక్తపరీక్షలు చేయాలి

యాడికి : జ్వరంతో ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు చేయాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండలంలోని రాయలచెరువు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇందులో భాగంగా ల్యాబ్ టెక్నీషియన్ సాయిలతను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఈనెల 20న ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి విష్యజ్వరాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే పెద్దపేట గ్రామంలో ఎఫ్.2 డ్రై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ సాయిలత, ఆశా కార్యకర్తలు మరియమ్మ, సరోజమ్మ, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

'పివికెకె'లో ముగిసిన వర్క్‌షాప్

అనంతపురం : స్థానిక పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో "సెన్సార్ ఇంటిగ్రేషన్ అండ్ అప్లికేషన్స్-బ్రిడ్జింగ్ ది ఫిజికల్ అండ్ డిజిటల్ వరల్డ్" అనే అంశంపై బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వారం రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో టెంపరేచర్, హ్యూమిడిటీ, మోషన్, ప్రాక్సిమిటీ వంటి విభిన్న రకాల సెన్సార్ల పరిచయం కల్పించడమే కాకుండా, ఆర్డినో, ఇఎస్‌పి 32 వంటి మైక్రోకంట్రోలర్స్‌తో వాటిని ఎలా ఇంటర్‌ఫేస్ చేయాలో విద్యార్థులకు ప్రాక్టికల్‌గా నేర్పించారు. కళాశాల ఛైర్మన్ పల్లె కృష్ణకిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ తరహా వర్క్‌షాప్‌లు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్దాన, ఎఒ మనోహర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సుదర్శన్, అధ్యాపకులు, విద్యార్థులను పాల్గొన్నారు.

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేయించాలి

యల్లనూరు : అన్నదాత సుఖీభవ పథకం రాని రైతులకు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేయాలని తహశీల్దార్ బి.రాము సూచించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ రాని రైతుల కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విఆర్‌ఒలు, విహెచ్‌ఎలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులందరూ ఒకే హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఉన్నందున చాలామంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులు అయ్యారన్నారు. అలాంటి వారందరికీ ఈనెల 25వతేదీలోపు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేసి అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు, సర్వేయర్లు, విహెచ్‌ఎలు, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణ భూమిలో రాళ్లు తొలగింపు

బుక్కరాయసముద్రం : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి ఆదేశాలతో మండలంలోని జంతులూరులోని సర్వే నెంబర్ 276లో ఐదెకరాల భూమిని ఆక్రమించుని పాతిన రాళ్లను అధికారులు సోమవారం తొలగించారు. అయితే మాజీ ఎమ్మెల్యే కారు డ్రైవర్ దేవా ఘటనా స్థలానికి చేరుకుని ఈ స్థలం తనదని చెప్పడంతో జంతలూరు గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీల ఇళ్ల స్థలాలకు కేటాయించిన స్థలంలో ఎవరు అక్రమనకు ప్రయత్నించిన చూస్తూ ఊరుకునేది లేదన్నారు. దీంతో అక్కడ నుంచి దేవా జారుకున్నాడు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు చిన్న ఆంజనేయులు, రామాంజనేయులు, చంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

శింగనమల : నార్పల మండల కేంద్రం సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 19న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. జాబ్‌మేళాలో దాదాపు పదికిపైగా జాతీయ, మల్టీనేషనల్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఉపాధి' బిల్లులు చెల్లించాలని వినతి


నార్పలలో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ శ్రామికులు

ప్రజాశక్తి-గుత్తి

ఉపాధి హామీ కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చందు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహశీల్దార్ జి.పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు బకాయి పడ్డ వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. పట్టణాల్లో కూడా ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో రాజకీయ జోక్యం ఉండరాదన్నారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వన్నూరమ్మ, జయమ్మ, వెంకటలక్ష్మి, అలివేలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలని కోరుతూ ఉపాధి శ్రామికులు సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మమతాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రామికులు మాట్లాడుతూ మే నెల నుంచి ఉపాధి హామీ బిల్లులు చెల్లించలేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వెంటనే ఉన్నతాధికారులకు స్పందించి ఉపాధి హామీ పథకం బిల్లులు చెల్లించాలని కోరారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని నిదనవాడ ఎస్సీ కాలనీకి శ్మశాన స్థలం కేటాయించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ నిదనవాడ గ్రామంలో దళిత కాలనీకి శ్మశాన వాటిక లేకపోవడంతో ఎవరైనా చనిపోతే ఖననం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే స్పందించి శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు. అలాగే మండలంలోని బ్యాంకు అధికారులు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన డబ్బులను అప్పులకు జమ చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు తొలగించిన వికలాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని కోరారు. వీటితోపాటు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, జయరాముడు, సూర్యప్రకాష్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, ధనాంజనేయులు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మేకల పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

తోపుదుర్తిలో 'మీసమస్య-మాబాధ్యత'

ఆత్మకూరు : ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు సోమవార ంమండలంలోని తోపుదుర్తి గ్రామంలో మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై దాదాపు 300కుపైగా అర్జీలు వచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గంటి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి గుండారావు నరసింహచౌదరి, నాయకులు గడిపూటి కృష్ణమోహన్‌చౌదరి, వెంకటనారాయణ, వడ్డే నాగేంద్ర, బిల్లే బాలఉజ్జినప్ప, కొండలోపల్లి పోతలయ్య, రామకృష్ణ, జి.శంకర్, నారాయణరెడ్డి, బోసి ఆదినారాయణ, లింగమయ్య, రాజేష్, సురేష్‌నాయుడు, చంద్రశేఖర్, డీలర్లు రాజన్న, పోతన్న, రాజు, రాజేంద్ర, శివానంద పాల్గొన్నారు.

రాప్తాడు : మండల పరిధిలోని పాలచర్ల గ్రామంలో మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పంపుకొండప్ప, నాయకులు దగ్గుపాటి శ్రీనివాసులు, గంగులకుంట కిట్ట, బ్రహ్మానందరెడ్డి, ముత్యాలప్ప, రాము, నారాయణస్వామి, రామునిపల్లి రాము, గోపాల్, పవన్, గవ్వల నరేష్, రామ్మోహన్, రాము, తదితరులు పాల్గొన్నారు.

అర్హుల పింఛన్ల తొలగింపు సరికాదు

గుంతకల్లు : పున:పరిశీలన నెపంతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించడం సరైంది కాదని సిపిఐ నాయకులు అన్నారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, జిల్లా సమితి సభ్యులు బి.మహేష్, ప్రజానాట్య మండలి పట్టణ కార్యదర్శి పుల్లయ్య, నాయకులు కత్తి శీన, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.